దేశ చరిత్రలో చెరగని ముద్రవేసిన కరుణ

● ప్రధాని మోదీ ప్రశంస



కరుణానిధితో ప్రధాని మోదీ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పలుమార్లు శాసనసభ్యుడిగా ఎన్నికై తమిళనాడు ముఖ్యమంత్రి పదవి కూడా చేపట్టిన కలైంజర్ కరుణానిధి దేశ చరిత్రలో చెరగని ముద్రవేశారని ప్రధాని నరేంద్రమోదీ కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ఫొటోతో ముద్రించిన రూ.100ల నాణేన్ని ఆయన శతజయంతి వేడుకల ముగింపు ఉత్సవాల్లో ఆవిష్కరిస్తున్న సందర్భంగా మోదీ ముఖ్యమంత్రి స్టాలిన్‌కు లేఖ రాశారు. కరుణ శతజయంతి స్మారక నాణెం ఆవిష్కరించడం తనకెంతో ఆనందంగా ఉందని, భరతమాత ముద్దుబిడ్డల్లో ఒకరైన కరుణానిధి భారతరాజకీయాల్లో, సాహిత్యంలో కీలకపాత్ర పోషించారని, తమిళనాడు అభివృద్ధి, దేశ పురోభివృద్ధిపై ఎల్లప్పుడూ దృష్టిసారించేవారన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి కరుణానిధి తమిళ భాష, తమిళ సంస్కృతికి చేసిన కృషిని ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకుంటారని తెలిపారు. సాహిత్య నైపుణ్యం ఆయన రచనల ద్వారా ప్రకాశించడమే కాకుండా ఆయనకు 'కలైంజర్' అనే అరుదైన బిరుదు కూడా సంపాదించిపెట్టిందన్నారు. కలైంజర్ శతజయంతి ముగింపు వేడుకలు సందర్భంగా నిర్వహిస్తున్న నాణెం ఆవిష్కరణ సభ విజయం సాధించాలని కోరుకుంటున్నానని మోదీ ఆ లేఖలో పేర్కొన్నారు

విజయ్ పార్టీతో నామ్ తమిళర్ కట్చి పొత్తు

● ఎన్‌టీకే ఆర్గనైజర్ సీమాన్

ప్యారీస్, ఆగస్టు 18: రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరుగనున్న ఎన్నికల్లో సినీనటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగంతో పొత్తుపై త్వరలో మంతనాలు జరుపనున్నట్లు నామ్ తమిళర్ కట్చి ఆర్గనైజర్ సీమాన్ పేర్కొన్నారు. తిరువాన్మియూర్‌లో ఆదివారం పార్టీ దక్షిణ జిల్లా నిర్వాహకుల సమావేశం సీమాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇప్పటివరకు ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేయాలన్న అభిప్రాయం పార్టీ నిర్వాహకుల్లో ఉందని అయితే, మారుతున్న రాజకీయాలకనుగుణంగా ప్రజాదరణ కలిగిన పార్టీలతో పొత్తు కుదుర్చుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. సినీరంగంలో వేగంగా దూసుకెళ్తున్న సోదరుడు విజయ్ పార్టీతో చేతులు కలపాలని పార్టీ అధిష్ఠానం భావిస్తుందని, దీనిపై విజయ్ త్వరలోనే తన నిర్ణయం ప్రకటిస్తారని తెలిపారు. తిరుచ్చి ఎస్పీ వరుణ్‌కుమార్‌కు హత్యా బెదిరింపు వ్యవహారంలో తనకెలాంటి సంబంధం లేదన్నారు. కరుణానిధి రూ.100 నాణేం ఆవిష్కరణకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వం ఆహ్వానించలేదని, ఇది కూడా ఒక రకంగా మిత్రపక్ష పార్టీని అవమానపరిచినట్లేనని వ్యాఖ్యానించారు.

అట్టడుగువర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహానేత

కరుణానిధి

● కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ● రూ.100ల నాణెం ఆవిష్కరణ



కరుణానిధి రూపంతో రూ.100ల నాణేన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అట్టడుగువర్గాల సంక్షేమం కోసం జీవితపర్యంతమూ పోరాడిన మహానాయకుడు కరుణానిధి అని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. చేపాక్‌లోని కలైవానర్ అరంగంలో ఆదివారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకల ముగింపు సందర్భంగా ఆయన రూపంతో కూడిన రూ.100ల నాణేన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ తమిళనాట 1960లో డీఎంకేకు కరుణానిధి బలమైన పునాదులు వేయటం వల్లే ఐదు దశాబ్దాలకు ఆ పార్టీ సుస్థిరంగా ఉందన్నారు. సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కరుణ అధిక ప్రాధాన్యతనిచ్చేవారని, ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు మనునీతి పథకం పేరుతో వారంలో ఒక రోజు జిల్లా కలెక్టర్ల కార్యాలయాల్లో ప్రజావిజ్ఞప్తులదినం అమలు చేశారని గుర్తు చేశారు. రాజ్‌నాథ్ సింగ్ తన ప్రసంగాన్ని ప్రారంభించడానికి ముందుగా కరుణానిధికి ఘననివాళులర్పించేలా సభికులందరూ చప్పట్లు కొట్టమని విజ్ఞప్తి చేశారు. ఆమేరకు వేదికపైనున్న ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు, అధికారులు, వేదిక దిగువనున్న సభికులందరూ నిమిషంపాటు చప్పట్లు కొట్టారు. ఆ తర్వాత కేంద్ర మంత్రి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ పంజాబ్ నుండి తమిళనాడు వరకు రాజకీయ పెనుమార్పులు సంభవిస్తున్న సమయంలో రాజకీయ నాయకుడిగా వెలుగులోకి వచ్చిన నేత కరుణానిధి అని, మహిళాభ్యుదయం కోసం ఆయన దేశం గర్వించదగ్గ పథకాలు అమలు చేశారని, స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు , మహిళా స్వయం సహాయక సంఘాలు నెలకొల్పడం వంటి పథకాలు ఎన్నో ఉన్నాయని కొనియాడారు. తమిళ సాహిత్యం, సినీరంగంలోనూ కరుణానిధి చెరగని ముద్ర వేశారన్నారు. ఉత్తర ప్రదేశ్, తమిళనాడులో ఏర్పాటు చేసిన డిఫెన్స్ కారిడార్ల వల్ల రెండు రాష్ట్రాలు సమానంగా పురోభివృద్ధి సాధిస్తాయన్నారు. తాను కాశీ నగరానికి చెందినవాడినని, కాశీ తమిళ సంఘానికి తమిళనాడు ప్రజలకు మధ్య గల ప్రాచీన సంబంధాలపై అధ్యయనం కూడా కొనసాగుతుండటం హర్షణీయమన్నారు. కరుణానిధి జీవితం భావితరాలకు ఆదర్శనీయమని ఈ సందర్భంగా రాజ్‌నాథ్ పేర్కొన్నారు.



కలైవానర్ అరంగం వద్ద గరగాట్టం చేస్తున్న బాలికలు

ఈ సంతోషం వర్ణనాతీతం : స్టాలిన్

ఈ సభలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మాట్లాడుతూ శతజయంతి నాయకుడు కరుణానిధిని స్మరించుకునేలా ఆయన రూపంతో ముద్రించిన రూ.100ల నాణెం ఆవిష్కరణ సభలో పాల్గొనటం తనకెంతో ఆనందంగా ఉందని, ఈ సంతోషాన్ని మాటలలో వర్ణించలేకపోతున్నానని చెప్పారు. శాసనసభలో కరుణానిధి నిలువెత్తు చిత్రపటాన్ని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆవిష్కరించారని, ఓమందూరార్ ఎస్టేట్ ప్రాంతంలో కరుణ విగ్రహాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయకుడు, అన్నా అరివాలయంలో కరుణ విగ్రహాన్ని సోనియాగాంధీ, మురసొలి పత్రికా కార్యాలయం వద్ద విగ్రహాన్ని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆవిష్కరించారని, ఆ కోవలో దేశ రక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తున్న రాజ్‌నాథ్ సింగ్ కరుణ నాణెం ఆవిష్కరించడం సముచితంగా ఉందన్నారు. ఎనిమిది దశాబ్దాల పాటు ప్రజా సేవకే అంకితమై, అందులో అర్థశతాబ్దంపాటు రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్రవేసిన మహానేత కలైంజర్ అని కొనియాడారు. అలాంటి నాయకుడి నాణెం ఆవిష్కరించడానికి పార్టీలకతీతంగా అన్ని పార్టీల వారు విచ్చేయడం ఆనందంగా ఉందన్నారు. గత యేడాది నుండి ఇప్పటి దాకా కరుణశతజయంతి వేడుకలను రోజూ జరుపుకుంటూనే ఉన్నామని, ఆయన గొప్పదనాన్ని, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించేందుకు ఒకరోజు చాలదన్నారు. నాణెం ఆవిష్కరణ కార్యక్రమ వేదిక గతంలో బాలల భవనంగా ఉండేదని, ఇక్కడ కలైవానర్ అరంగం నిర్మించింది కూడా కరుణానిధి అని గుర్తు చేశారు. తమిళ భాషకు ప్రాచీన హోదా, మద్రాసు పేరు చెన్నైగా మార్పు, సాగుజలాలందించే 44 ఆనకట్టు, విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు, రాజధాని నగరం చుట్టూ అన్నాసాలై, అన్నా ఫ్లైఓవర్, వళ్లువర్ కోట్టమ్, కత్తిపార ఫ్లైఓవర్, కోయంబేడు ఫ్లైఓవర్, సెమ్మొళి పూంగా, టైడల్ పార్కు, సచివాలయం కోసం నిర్మితమై ప్రస్తుతం ఓమందూరార్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా ఉన్న భవనం ఇలా ఎన్నో నగరవాసులు గర్వించదగ్గ చిహ్నాలను ఏర్పాటు చేసిన ఘనత ఆ మహానేతకే దక్కిందన్నారు. 1999లో కార్గిల్ పోరుకు అప్పటి ప్రధాని వాజ్‌పేయికి మూడువిడతలుగా రూ.50 కోట్ల విరాళం ఇవ్వటం ఇవన్నీ కరుణ జీవితంలో కీర్తించదగ్గ అంశాలన్నారు. ఈ నాణెం ఆవిష్కరణకు అన్ని పార్టీలతో సఖ్యత కలిగిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తన చాయిస్‌గా ఎంపిక చేసుకున్నానని, తన ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన ఆయనకు నాణెం విడుదలకు సహకరించిన ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు చెబుతూ స్టాలిన్ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ సభలో కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర మంత్రులు, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు,

సీపీఐ నేత ముత్తరసన్, డీపీఐ నేత తిరుమావళవన్, ద్రావిడ కళగం నేత కే వీరమణి, సినీ గేయరచయిత వైరముత్తు తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకల సందర్భంగా కలైవానర్ అరంగం చుట్టూ కేరళ చండీ మేళం, మంగళవాయిద్య కళాకారులు మంగళవాయిద్యాలతో ప్రముఖులకు స్వాగతం పలికారు.

ముందుగా మెరీనాబీచ్‌లోని డీఎంకే వ్యవస్థాపకుడు అన్నాదురై సమాధి , ఆ తర్వాత కరుణానిధి సమాధి వద్ద కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాళులర్పించారు ఇక ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం మధ్యాహ్నమే నగరానికి విచ్చేసిన కేంద్ర మంత్రికి విమానాశ్రయం వద్ద డీఎంకే కోశాధికారి ఎంపీ టీఆర్‌బాలు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కనిమొళి, మంత్రి తంగం తెన్నరసు, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తదితరులు స్వాగతం పలికారు.



కరుణానిధి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితరులు

మంకీ ఫీవర్‌పై అప్రమత్తం

● విమానాశ్రయాల్లో నిఘా తీవ్రతరం
● మంత్రి సుబ్రమణ్యం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుబ్రమణ్యం

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మంకీ ఫీవర్‌ను నిరోధించేందుకు ఆరోగ్యశాఖ పటిష్ఠమైన చర్యలు చేపడుతోందని, ఆ మేరకు విమానాశ్రయాల్లో తీవ్ర నిఘా ఏర్పాటు చేసిందని ఆ శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. సైదాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో మధుమేహరోగులకు 10వేలకు పైగా డయాలసిస్ చికిత్స చేసిన ఆస్పత్రి నిర్వాహకులను ఆయన ప్రశంసించారు. ఆ ఆసుపత్రి వద్ద రూ.26.50 కోట్లతో జరుగుతున్న భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి స్టాలిన్ వైద్య రంగంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారని, ముఖ్యంగా నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రులను మెరుగుపరిచేందుకు భారీగా నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. సైదాపేట, కొళత్తూరు తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులు ఇప్పటికే కొత్త రూపు సంతరించుకున్నాయని, ఆ ఆస్పత్రుల్లో కొత్త సాంకేతిక వైద్య పరికరాలు కూడా సమకూర్చామని తెలిపారు. దేశంలో వైద్య బీమా పథకం భారీ స్థాయిలో అమలు చేస్తున్న రాష్ట్రంగా తమిళనాడు పేరుగడించిందని, కలైంజర్ శతజయంతి స్మారక ప్రభుత్వ ఆస్పత్రిలో మూడు లక్షల మందికి పైగా అవుట్ పేషంట్లు మెరుగైన చికిత్స అందుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ దేశాల్లో మంకీ ఫీవర్ వ్యాపిస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయని, భారతదేశంలో ఆ వింత జ్వరం వ్యాపించలేదని కేంద్ర మంతి నడ్డా స్పష్టం చేశారని, అదే విధంగా రాష్ట్రంలో ఆ జ్వరాలు వ్యాపించినట్లు ఇప్పటివరకూ ఎలాంటి దాఖలా లేదన్నారు. అయితే విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల ద్వారా ఈ జ్వరం వ్యాపించే అవకాశాలుండటంతో రాష్ట్రంలోని చెన్నై, కోయంబత్తూరు, మదురై, తిరుచ్చి తదితర విమానాశ్రయాల్లో విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులను థెర్మోస్కానింగ్ చేస్తున్నట్లు చెప్పారు. విదేశాల నుంచి విమానాశ్రయంలో అడుగుపెట్టేవారికి ఎవరికైనా మంకీ ఫవర్ ఆనవాళ్లు ఉంటూ వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. అన్నాడీఎంకే మాజీ మంత్రి జయకుమార్ ముఖ్యమంత్రి పేరుతో మందుల దుకాణాలను ఏర్పాటు చేయనుండటాన్ని హేళన చేయడం గర్హనీయమని మంత్రి సుబ్రమణ్యం పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి జయలలిత పేరుతో మందుల దుకాణాలు ప్రారంభించినట్లు ప్రకటన మాత్రమే చేశారని, ఆ పేరుతో ప్రస్తుతం ఎక్కడా మందుల దుకాణాలు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో 800 మందుల దుకాణాలు మాత్రమే నడుస్తున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో వచ్చే సంక్రాంతికి మధ్యతరగతి కుటుంబాలు లబ్ధి పొందేలా తక్కువ ధరలకు మందులను విక్రయించే 1000 మందుల దుకాణాలను ప్రారంభించనున్నామని చెప్పారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో ఏర్పాటైన అమ్మా క్లినిక్‌లు కూడా తగు వైద్య సిబ్బంది లేకుండా ప్రారంభించారని, డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ క్లినిక్‌లను ప్రజారోగ్య కేంద్రాలుగా మార్చి తగు వైద్య సిబ్బందిని కూడా నియమించిందని చెప్పారు. ఈ వాస్తవాలు తెలుసుకోకుండా మాజీ మంత్రి జయకుమార్ పసలేని విమర్శలు చేయడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సాంకేతిక లోపం..

మెట్రోరైళ్ల సేవలకు అంతరాయం



పెరంబూర్, ఆగస్టు 18: సాంకేతిక లోపం కారణంగా వింకోనగర్-విమానాశ్రయం తదితర రెండు మార్గాల్లో మెట్రోరైలు సేవలు ఆదివారం మధ్యాహ్నం స్తంభించాయి. ముఖ్యంగా, సెంట్రల్-విమానాశ్రయం మధ్య మెట్రో సేవలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వింకోనగర్-విమానాశ్రయం, సెంట్రల-విమానాశ్రయం రెండు మార్గాల్లో 54 కి.మీ మేర మెట్రోరైలు సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ రైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. పీక్ అవర్స్‌లో ప్రయాణికుల కోసం 3 నిమిషాలకు ఒక మెట్రోరైలు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో, వింకోనగర్-విమానాశ్రయం మార్గం ఆదివారం మధ్యాహ్నం 12.50 గంటలకు హఠాత్తుగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో, వింకోనగర్-విమానాశ్రయం, సెంట్రల్-సెయింట్ థామస్ మౌంట్ రెండు మార్గాల్లో మెట్రో రైళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో, సీఎంఆర్‌ఎల్ ఇంజనీర్లకు సిబ్బంది సమాచారం అందించారు. ఇంజనీర్లు సత్వరం సాంకేతిక లోపాన్ని సరిచేయడంతో, ఈ మార్గాల్లో 15 నుంచి 20 నిమిషాలకు ఒక మెట్రోరైలు నడిపారు. ఈ రైళ్లు కూడా ఒక్కో స్టేషన్‌లో 5 నుంచి 10 నిమిషాలు ఆగుతూ వెళ్లాయి. అదే సమయంలో, సెంట్రల్-విమానాశ్రయం మధ్య ఉన్న గ్రీన్ మెట్రోరైలు మార్గంలో మెట్రోరైళ్ల సేవలు నిలిపివేశారు. అనంతరం సాంకేతిక లోపం సరిచేసే పనులు మధ్యాహ్నం 1.35 గంటలకు ముగిశాయి. 2.10 గంటల నుంచి ఈ రెండు మార్గాల్లో మెట్రోరైళ్ల సేవలు యధావిధిగా సాగాయి.

రిజర్వేషన్లను ఉల్లంఘిస్తున్న యూపీఎస్సీ

● ఎంపీ విల్సన్ ఆరోపణ

ప్యారీస్, ఆగస్టు 18: ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజల రిజర్వేషన్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఉల్లంఘిస్తోందని డీఎంకే ఎంపీ విల్సన్ ఆరోపించారు. ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... ఉద్యోగుల ఎంపిక విధానంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు కల్పించిన రిజర్వేషన్ పాటించాలని రాజ్యాంగ శాసనం స్పష్టంగా తెలుపుతోందని అయితే, యూపీఎస్సీ దీనిని పూర్తిగా ఉల్లంఘించిందని వ్యాఖ్యానించారు. పదవులకు సంబంధించి ఎలాంటి రిజర్వేషన్ ఇవ్వకుండా 10 మంది జాయింట్ కార్యదర్శి పదవులు, 35 డైరెక్టర్ సహా 45 పోస్టులకు సంబంధించి యూపీఎస్సీ ప్రకటించినట్లు తెలిపారు. ఇందులో విచిత్రమేమిటంటే కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు ఈ పదవులకు దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించలేదని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ వ్యవహారంలో జోక్యం కలుగజేసుకొని రిజర్వేషన్ విధానాన్ని సక్రమంగా అమలుపరచేలా చర్యలు చేపట్టాలని కోరారు.

అత్తికడవు - అవినాశిపై డీఎంకే గొప్పలు

● ఈపీఎస్ విమర్శ

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు, తిరుప్పూరు, ఈరోడ్ తిరుప్పూరు జిల్లాలకు సాగునీరు, తాగునీరందించే నిమిత్తం అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో చేపట్టిన అత్తికడవు - అవినాశి పథకంపై డీఎంకే పాలకులు అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఆరోపించారు. తిరుప్పూరు జిల్లా పల్లడం సమీపం నాదే గౌండంపాళయంలో రాష్ట్ర రైతుల సంఘాల సమాఖ్య మాజీ నాయకుడు, మాజీ శాసనసభ్యుడు ఎన్ఎస్ పళనిసామి స్మారక మండపాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన ప్రసంగిస్తూ మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ హయం నుంచే ఆ పథకానికి సంబంధించి ప్రాథమిక స్థాయి సర్వే, పరిశీలన జరిగిందని, ఆ తర్వాత జయలలిత ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ పథకం ప్రారంభించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఐదు దశాబ్దాలుగా ఆ పథకం కోసం ఆందోళనలు జరుపుతున్న అన్నాదాతలకు భరోసా ఇచ్చేలా తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ.1653 కోట్లు ఆ పథకం నిర్మాణానికి కేటాయించినట్టు ఆయన చెప్పారు. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడల్లా అత్తికడవు - అవినాశి పథకం అమలుపై సర్వేలు, పరిశీలనలు జరుపుతున్నట్లు, నిపుణుల కమిటీని నియమించినట్లు ప్రకటనలు మాత్రమే వచ్చాయి తప్ప ఆ పథకం అమలుకు ఎలాంటిచర్యలు చేపట్టలేదని, నిధులు కూడా మంజూరు చేయకుండా పథకం ప్రధాన ప్రణాళిక ఫైలు కూడా బుట్టదాఖలు చేసిందని ఈపీఎస్ ఆరోపించారు. అన్నాడీఎంకే ప్రభుత్వం అత్తికడవు - అవినాశి పథకాన్ని 90 శాతం పూర్తి చేసిందని, డీఎంకే ప్రభుత్వం ఆ 10 శాతం పనులు పూర్తి చేయడానికి మూడేళ్లు పట్టిందని ఆయన యెద్దేవా చేశారు. డీఎంకే ప్రభుత్వానికి రైతు సంక్షేమంపై ఏ మాత్రం శ్రద్ధ ఉన్నా ఆరునెలల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేసి ఉండవచ్చునని, అన్నాడీఎంకే ప్రభుత్వ పథకం కనుకనే ప్రాజెక్టు పనులను మూడేళ్ల పాటు సాగదీసిందని కూడా ఈపీఎస్ విమర్శించారు.



సభలో ప్రసంగిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

గణపతి విగ్రహాలు పదడుగులకు మించరాదు

● ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ శంకర్ జివాల్



ఐసిఎఫ్, ఆగస్టు 18: వినాయక చతుర్థిని పురస్కరించుకొని సెప్టెంబరు 7వ తేది ఉత్సవాలు జరుపుకోనున్న నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా విగ్రహాలు ఏర్పాటుపై డీజీపీ శంకర్ జివాల్ సర్క్యులర్ విడుదల చేశారు. రసాయనాలు లేని విగ్రహాలు మాత్రమే ఏర్పాటుచేయాలని, సహాయ పోలీస్ కమిషనర్, ఆర్డీఓ, డిప్యూటీ కలెక్టర్ నుంచి అనుమతి పొందాలని సూచించారు. ప్రైవేటు స్థలంలో విగ్రహాలు ఏర్పాటుచేయాల్సి వస్తే ఆ స్థలం యజమాని నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలన్నారు.. స్థానిక సంస్థల అనుమతి పొందాలని, లౌడ్ స్పీకర్లు ఏర్పాటుకు పోలీసు ఇన్‌స్పెక్టర్ అనుమతి పొందాలని తెలిపారు. విద్యుత్ ఎక్కడ నుంచి పొందుతున్నారనే వివరాలు తప్పనిసరిగా తెలియజేయాలని, వినాయక విగ్రహాలు పీఠంతో కలిపి పదడుగులకు మించరాదని సూచించారు. ఇతర ఆరాధన స్థలాలు, ఆస్పత్రులు, విద్యాసంస్థల సమీపంలో వీటిని ఏర్పాటుచేయరాదన్నారు. ఇతర మతస్థుల మనోభావాలు దెబ్బతినేలా నినాదాలు చేయరాదని, విగ్రహాల ఊరేగింపులో కానీ, విగ్రహాలు ఏర్పాటు వద్ద కానీ బాణసంచా కాల్చరాదన్నారు. విగ్రహాలను మినీ లారీ, ట్రాక్టర్ వంటి ద్వారా తరలించాలే తప్ప, ఎడ్ల బండి, మూడు చక్రాల వాహనాల్లో తరలించరాదన్నారు. అలాగే సంఘ విద్రోహులు ఎలాంటి అసంభావిత సంఘటనలకు పాల్పడకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, మసీదుల్లో నమాజు జరిగే సమయాల్లో ఊరేగింపు జరపరాదని సూచించారు. ఊరేగింపు వెళ్లే దారిలో అనుమతి లేకుండా బ్యానర్లు, జెండాలు కట్టడం మానుకోవాలని, భద్రతా ఏర్పాట్లను ఈ నెల 30వ తేదిలోపు చేపట్టాలని డీజీపీ శంకర్ జివాల్ పోలీసులను ఆదేశించారు.

వ్యవసాయ పరికరాల అద్దె ద్వారా రూ.10.20 కోట్ల ఆదాయం

పెరంబూర్, ఆగస్టు 18: వ్యవసాయ పనిముట్లు 'ఈ-వాడగై' యాప్ ద్వారా అద్దెకు ఇవ్వడంతో ప్రభుత్వానికి రూ.10.20 కోట్ల మేర ఆదాయం లభించిందని వ్యవసాయ శాఖ మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం తెలిపారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2022లో ప్రారంభించిన 'ఈ-వాడగై' యాప్ ద్వారా 2022-23లో 21,166 మంది, 2023-24 సంవత్సరంలో 30,963 మంది రైతులు వ్యవసాయ పనిముట్లు అద్దెకు తీసుకున్నారని, అందువల్ల ప్రభుత్వానికి రూ.10.20 కోట్ల ఆదాయం లభించిందని మంత్రి తెలిపారు.

యూనిఫాం ఉద్యోగుల సెలక్షన్ కమిషన్ అధ్యక్షుడిగా సునీల్‌కుమార్

ఐసిఎఫ్, ఆగస్టు18: యూనిఫాం ఉద్యోగుల సెలక్షన్ కమిషన్ అధ్యక్షుడిగా మాజీ డీజీపీ సునీల్‌కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన తమిళనాడు బిల్డింగ్ ల్యాండ్ సేల్ రెగ్యులేటరీ కమిషన్ (రెరా) అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో, సునీల్‌కుమార్‌ను తమిళనాడు యూనిఫాం ఉద్యోగుల ఎంపిక కమిషన్ అధ్యక్షుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు ఐజీల నుంచి డీజీపీ వరకు పదవిలో ఉన్న వారు మాత్రమే నియమితులవుతుండగా, తొలిసారిగా మాజీ డీజీపీ నియమితులు కావడం గమనార్హం.

మళ్లీ చేపల వేటకు వెళ్లిన పాంబన్ జాలర్లు

పెరంబూర్, ఆగస్టు 18: పాంబన్ నాటు పడవ జాలర్లు 8 రోజుల అనంతరం ఆదివారం చేపల వేటకు వెళ్లారు. పాంబన్ నుంచి ఈ నెల 8న చేపలవేటకు వెళ్లిన అలెక్స్, రంజన్, ఛార్లెస్, సూసై మార్గిన్‌లకు చెందిన నాలుగు నాటు పడవలను స్వాధీనం చేసుకున్న శ్రీలంక నావికాదళం, 35 జాలర్లను అరెస్ట్ చేసింది. 35 మంది జాలర్లపై ఛార్జిషీటు దాఖలుచేయగా, ఈ నెల 22 వరకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. శ్రీలంక నావికాదళం అమానుష దాడులు వ్యతిరేకిస్తూ, శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్లు, వారి పడవలు విడిపించేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ పాంబన్ నాటు పడవల జాలర్లు ఈ నెల 10 నుంచి సమ్మె చేపట్టారు. ఈ క్రమంలో, నాగపట్టణం తహసీల్దార్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్లు జాలర్లతో సమావేశమై, జాలర్లను విడిపించేలా చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించిన జాలర్లు, ఆదివారం 150 నాటు పడవల్లో 1,000 మంది పైగా చేపలవేటకు బయల్దేరి వెళ్లారు.

ఫేస్‌బుక్‌లో గాంధీపై కళంకం : ఓ వ్యక్తిపై కేసు

ఐసిఎఫ్, ఆగస్టు 18: ఫేస్‌బుక్‌లో జాతిపిత గాంధీని కళంకపరచిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదుచేశారు. మదురై కామరాజర్ పురానికి చెందిన వేల్‌మురుగన్ ఈ నెల 11న మదురై పోలీస్ కమిషనర్ లోకనాథన్ కు చేసిన ఫిర్యాదులో... కల్యాణ సుందరం అనే వ్యక్తి ఫేస్‌బుక్‌లో గాంధీ కీర్తి ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా చేతిలో వేట కొడవళ్లు ఉన్నట్లు చిత్రీకరించారని, ఇది గాంధేయవాదుల మనోభావాలు దెబ్బతీసిందని, ఆ వ్యక్తిపై చర్యలు చేపట్టేందుకు ఆదేశాలు జారీచేయాలని కోరారు. కమిషనర్ ఉత్తర్వుల మేరకు సైబర్ క్రైం పోలీసులు, సుందరంపై కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నారు.

తిరుచెందూర్‌లో వెనక్కిమళ్లిన సముద్రం

ప్యారీస్, ఆగస్టు 18: తూత్తుకుడి జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుచెందూర్‌లో సముద్రం హఠాత్తుగా 70 అడుగులకు వెనక్కి వెళ్లడం సుబ్రమణ్యస్వామి భక్తులను ఆందోళనకు గురిచేసింది. సోమవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా తిరుచెందూర్ ఆలయంలో నిర్వహించే ప్రత్యేక పూజల కోసం ఆదివారమే భక్తులు అక్కడికి వెళ్లారు. ఆదివారం ఉదయం పలువురు భక్తులు సముద్రతీరంలో స్నానానికి వెళ్లగా ఊహించని విధంగా సముద్రం వెనక్కి మళ్లడంతో బండరాళ్లు బయటపడ్డాయి. దీంతో భక్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం తెలిసి పోలీసులు సముద్రతీరంలో భద్రత కట్టుదిట్టం చేశారు.

మత్తుమాత్రలతో నలుగురు యువకుల అరెస్టు

అడయార్, ఆగస్టు 18: మదురై జిల్లాలోని తిరుమంగళం గుండారు సమీపంలోని మత్తు మాత్రలను కలిగివున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు శనివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారి వద్ద 160 మత్తు మాత్రలు న్నట్టు గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. తిరుమగళంకు చెందిన అరుణ్ కుమార్, ఇళంగో, హుస్సేన్ సహా మరో నలుగురు యువకులను అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసి, ఆ తర్వాత వీరిని న్యాయమూర్తి నివాసంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

రాజీవ్ జయంతి వేడుకలు ఘనంగా జరపండి

● పార్టీ శ్రేణులకు టీఎన్‌సీసీ చీఫ్ పిలుపు

అడయార్, ఆగస్టు 18: దివంగత రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో దేశంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, ఆయన అమలు చేసిన పథకాలు ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుందగై పిలుపునిచ్చారు. ఈ నెల 20వ తేదీ రాజీవ్ గాంధీ 80వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా, జయంతి వేడుకలను పురస్కరించుకుని, రాజీవ్ సుపరిపాలనలో దేశం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. ఇందుకోసం రాజీవ్ చిత్రపటంతో కూడిన ప్రచార రథాలను సిద్ధం చేసుకుని, వీధి వీధికివెళ్లి రాజీవ్ గాంధీ హయాంలో ప్రవేశపెట్టి అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించాలని సెల్వపెరుందగై పేర్కొన్నారు.

రూ.లక్ష లంచం.. ఎస్‌ఐ సహా నలుగురి సస్పెన్షన్

అడయార్, ఆగస్టు 18: పక్షులను వేటాడే వారిపై కేసు నమోదు చేయకుండా ఉండేందుకు లక్ష రూపాయలు లంచంగా పుచ్చుకున్న ప్రత్యేక పోలీస్ విభాగం ఎస్‌ఐ సహా నలుగురు పోలీసులను తిరుచ్చి జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. సస్పెండ్‌కు గురైన వారిలో పుత్తానత్తం పోలీస్ స్టేషన్ స్పెషల్ వింగ్ ఎస్‌ఐ లియో రంజిత్ కుమార్, కానిస్టేబుళ్ళు వీరపాండి, సాహుల్ హమీద్, మణికంఠన్ ఉన్నారు. పుత్తానత్తం ప్రాంతంలో పక్షులను వేటాడే సదాశివం (28), రామస్వామి (25), నాగరాజ్ (33) అనేవారిపై కేసు నమోదు చేయకుండా ఉండేందుకు పోలీసులు రూ.లక్ష లంచంగా తీసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై పోలీస్ ఉన్నతాధికారులు విచారణ జరుపగా, నిజమని తేలడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఆలయ ఉత్సవాల నిర్వహణపై ఘర్షణ

పెరంబూర్, ఆగస్టు 18: కడలూరు జిల్లా బన్రూటి సమీపం మేలిరుప్పు గ్రామంలోని ముత్తాలమ్మన్ ఆలయ ఉత్సవాల నిర్వహణపై గొడవ జరిగింది. ఉత్సవాలు ఎవరు నిర్వహించాలనే విషయమై రెండు వర్గాల మధ్య గొడవ జరగడంతో చైత్ర మాసంలో నిర్వహించే ఆలయ ఉత్సవాలను అధికారులు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో, పంచాయతి కౌన్సిలర్ గణపతి తరఫున ఈ నెల 21న ఉత్సవాలు జరిపేందుకు న్యాయస్థానం అనుమతితో ఏర్పాట్లు చేపట్టారు. దీనిని వ్యతిరేకిస్తూ అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బాబు మద్దతుదారులు తమ ఇళ్లపై నల్లజెండాలు ఎగురవేసి నిరసన తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటైంది.

నాగై నుంచి 8 మందితో శ్రీలంకకు బయల్దేరిన నౌక

పెరంబూర్, ఆగస్టు 18: నాగపట్టణం నుంచి శ్రీలంకలోని కాంగేసన్ హార్బర్‌కు ప్రయాణికుల నౌక రవాణా ప్రారంభమైన విషయం తెలిసిందే. ప్రారంభం రోజున ఈ నౌకలో ఐదుగురు శ్రీలంక తమిళులు సహా 50 మంది నాగై నుంచి శ్రీలంక వెళ్లారు. ఆ నౌక శనివారం సాయంత్రం శ్రీలంక నుంచి నాగైకు చేరుకుంది. అందులో శ్రీలంకకు చెందిన 15 మంది, భారత్‌కు చెందిన 10 మంది మొత్తం 25 మంది ప్రయాణించారు. ఈ నేపథ్యంలో, ఆదివారం ఉదయం కేవలం 8 మంది మాత్రమే శ్రీలంక వెళ్లేందుకు ముందస్తు టిక్కెట్ రిజర్వేషన్ చేయించుకున్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు బయల్దేరిన నౌకలో 8 మంది ప్రయాణికులు, సిబ్బంది 15 మంది ఉన్నారు.

విద్యార్థినులకు లైంగిక వేధింపులు నామ్‌తమిళర్ కట్చి నేత అరెస్టు


శివరామన్(ఫైల్)

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా బర్గూరు గాంధీకుప్పంలో ప్రైవేటు పాఠశాల విద్యార్థినులకు ఎన్ఎస్ఎస్, ట్యూషన్ల శిబిరం నిర్వహిస్తూ వారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన నామ్‌తమిళర్ కట్చి స్థానిక శాఖ శివరామన్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రైవేటు పాఠశాల నిర్వాహకుల అనుమతితో గత కొద్ది నెలలుగా ఆయన విద్యార్థినులకు ట్యూషన్లు చెబుతున్నారు. ఆ సందర్భంగా కొంతమంది విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధితులు ఈ విషయాన్ని మహిళా పోలీసులకు ఫిర్యాదు చేయడటంతో శివరామన్‌ను పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. అతడికి సహకరించిన బంధువులు ఐదుగురిని కూడా అరెస్టు చేశారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న నామ్‌తమిళర్ కట్చి ఆయనను పార్టీ సభ్యత్వం నుండి తొలగిస్తూ ప్రకటన జారీ చేసింది.

17వ శతాబ్దం నాటి విగ్రహం లభ్యం



ఐసిఎఫ్, ఆగస్టు 18: తేని జిల్లా బోడి సమీపంలోని దేవారంపిరంబుకట్టి వాగు సమీపంలో క్రీ.శ 17వ శతాబ్దానికి చెందిన విగ్రహాన్ని గుర్తించారు. ప్రభుత్వ మహోన్నత పాఠశాల చరిత్ర ఉపాధ్యాయుడు శివప్రకాశం, విద్యార్థులు ఈ ప్రాంతంలో పరిశోధన చేపట్టారు. వాగు తీరంలో పూడుకుపోయిన ఓ విగ్రహాన్ని కనుగొన్నారు. ఈ విగ్రహం 5 అడుగుల ఎత్తు, ఒకటిన్నర అడుగుల వెడల్పు ఉందని, ఓ వీరుడు కుడి చేతిలో ఖడ్గం, ఎడమ చేతిలో తుపాకి పట్టుకొని ఉన్నట్లు తెలిపారు. ఆ వీరుడు ఈ ప్రాంతంలో ఉన్న ఏదో ఒక యుద్ధంలో మృతిచెంది ఉంటాడని, ఆయన ఇద్దరు భార్యలు సతీసహగమనం చేసినట్లు తెలుస్తుందన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల మృతి


మృతులు దీన, దివాకరన్ (ఫైల్)

పెరంబూర్, ఆగస్టు 18: ఉత్తరపాళయం బైపాస్ రోడ్డులో రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. తేని జిల్లా చిన్నమలూరు సమీపం అశోక్ నగర్‌కు చెందిన దీనా పీజీ పూర్తిచేయగా, అతని స్నేహితుడు దివాకరన్ యూజీ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నారు. వారిద్దరూ శనివారం చిన్నమలూరు నుంచి కంభం వైపు బైక్‌పై వెళ్తున్నారు. ఉత్తమపాళయం బైపాస్ రోడ్డులో వెళ్తుండగా, ఎదురుగా అహ్మద్ మీరాన్ నడుపుతున్న బైక్ ఢీకొంది. ఈ ఘటనలో దీనా, దివాకరన్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వారిని వెంటనే ఉత్తమపాళయం ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం తేని ప్రభుత్వ వైద్యకళాశాలకు తరలించారు. అక్కడ చికిత్స ఫలించక ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనపై ఉత్తమపాళయం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

క్రీడా విజేతలకు బహుమతుల ప్రదానం



వేలూరు, ఆగస్టు 18: సన్‌బీమ్ సీబీఎస్ఈ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కుమరన్ ఆస్పత్రి వైద్యులు అనితసేందన్, జిల్లా విద్యాధికారి (ప్రైవేటు పాఠశాలలు) పళని పాల్గొని, పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి పాఠశాల కమిటీ అధ్యక్షుడు హరిగోపాలన్ అధ్యక్షత వహించగా, ప్రిన్సిపాల్ తంగప్రకాశ్, ఉపాధ్యక్షుడు డా.జార్జ్ అరవింద్ పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ రతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హిజ్రాల సమస్యలపై అవగాహన


అతిథులకు జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, ఆగస్టు 18: స్థానిక కాట్పాడి గాంధీ నగర్‌లో ఉన్న డాన్ బాస్కో పాఠశాలలో హిజ్రాల సమస్యలు, సమాజంలో వారు అభివృద్ధి సాధించడం తదితరాలపై సమావేశం జరిగింది. ఇందులో సురభి సహా కార్యక్రమ ఆర్గనైజర్‌గా ఫాదర్ కమలేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డా.ఇన్బా ఇగ్నేషియస్, డా.గంగా నాయక్, డా. అమ్ములు నాయక్, డా.గోమతి, ఆర్.ప్రసాద్, ఫాదర్లు సుందర్, లియో తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్వహణ కమిటీ ఎంపిక



వేలూరు, ఆగస్టు 18: పాఠశాల నిర్వహణ కమిటీ సమావేశం కాట్పాడి గాంధీనగర్‌లో ఉన్న పంచాయతి యూనియన్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం జరిగింది. కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం ఇందర అధ్యక్షత వహించగా, కార్పొరేషన్ సభ్యుడు శివశంకరి ప్రసంగించారు. తొలుత పాఠశాల డిప్యూటీ హెచ్ఎం దేవి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో తమిళనాడు సైన్స్ సమాఖ్య సెక్రటరీ జనార్దనన్ హాజరయ్యారు. ఈ సమావేశంలో కమిటీ నూతన సభ్యుల ఎంపిక జరిగింది. అధ్యక్షులుగా సావిత్రి, ఉపాధ్యక్షులుగా భువనేశ్వరి, సభ్యులుగా శివశంకరి, అజయ్ కుమార్, డైసిప్రియ, ఆదిలక్ష్మి సహా 24 మంది ఎంపికయ్యారు. ఎంపికైన సభ్యులు ప్రతిజ్ఞ చేశారు.

డ్రాయింగ్ ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు

వేలూరు, ఆగస్టు 18: స్థానిక కాట్పాడి తాలూకా సేర్కాడు ప్రభుత్వోన్నత పాఠశాలలో చెన్నై ప్రభుత్వ డ్రాయింగ్ కళాశాల తరపున ఎగ్జిబిషన్ జరుగుతోంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన వేలూరు కేంద్ర కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు రాము జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో డ్రాయింగ్ ఫొటోలు, బంకమన్నుతో చేసిన విగ్రహాలు సహా పలు వస్తువులున్నాయి. ప్రముఖ చిత్రకారులు విజయ్ పిచ్చుమణి, శిక్షకులు బాలాజీ, గోవిందస్వామి, కలై, ఆనంద్, నాగరాజన్, కళాశాల శిక్షణ చిత్రకారులు అశ్విన్, అభిషేక్, భాస్కర్, హరీస్, మణికంఠన్, మీరా తదితరులు పాల్గొన్నారు. ఎగ్జిబిషన్ ఏర్పాట్లను విన్నంపల్లి పంచాయతి సభ్యులు మోహన్ పర్యవేక్షించారు.

మాంసం దుకాణాల్లో అధికారుల తనిఖీ



పెరంబూర్, ఆగస్టు 18: తంజావూరు జిల్లా పట్టుకోట అన్నా అపార్ట్‌మెంట్స్ ప్రాంతంలోని మూడు మాంసం దుకాణాల్లో ఆహార భద్రతా శాఖ అధికారులు ఆదివారం ఉదయం ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రజలకు ఆరోగ్యానికి హాని కలిగించేలా శుభ్రం లేకుండా బహిరంగ ప్రదేశాల్లో వేలాడ దీస్తున్నారని, కొన్ని దుకాణాల్లో చెడిపోయిన మాంసం విక్రయిస్తున్నారనే ఫిర్యాదులతో తనిఖీలు చేపట్టిన అధికారులు, దుకాణాల్లో 1,900 కిలో మాంసం వ్యర్థాలు ఉండడాన్ని గుర్తించి, రెండు దుకాణాలకు తలా రూ.5,000 జరిమానా విధించారు.

సమాచార దర్శిని

నేటినుంచి తెన్‌కాశి జిల్లాలో 144 సెక్షన్ అమలు

పెరంబూర్, ఆగస్టు 18: తెన్‌కాశి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21 నుంచి అక్టోబరు 2 వరకు రెండు విడతలుగా 144 సెక్షన్ విధిస్తున్నట్లు జిల్లా యంత్రాంగం ఉత్తర్వులు జారీచేసింది. భూలిదేవన్ 309వ జయంతి ఉత్సవం, ఒండివీరన్ 253వ వార్షికోత్సవాలు జరుగనున్నాయి. ఈ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సోమవారం నుంచి ఆగస్టు 21 వరకు, ఆగస్టు 30 నుంచి అక్టోబరు 2 వరకు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా యంత్రాంగం తెలిపింది.

నేటినుంచి యథావిధిగా సబర్బన్ రైళ్లు

ఐసిఎఫ్, ఆగస్టు 18: నగరంలో సబర్బన్ రైళ్లు సోమవారం నుంచి యదావిధిగా నడుస్తాయని చెన్నై డివిజన్ రైల్వే అధికారులు తెలిపారు. స్థానిక తాంబరం రైల్వేస్టేషన్ మూడో టెర్మినల్‌గా మారింది. ఇటీవల ఈ స్టేషన్ అభివృద్ధి పనులు ప్రారంభమై ముమ్మరంగా జరిగాయి. ఈ కారణంగా తాంబరం-పల్లావరం మధ్య పలు సబర్బన్ రైళ్లను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో, పనులు పూర్తికావడంతో సోమవారం నుంచి చెన్నై బీచ్-చెంగల్పట్టు మధ్య రైళ్లు యదావిధిగా నడుస్తాయని అధికారులు తెలిపారు.

నేడు ఫుట్‌పాత్ వ్యాపారులకు గుర్తింపు కార్డులు

పెరంబూర్, ఆగస్టు 18: నగరంలో ఫుట్ పాత్ వ్యాపారులకు సోమవారం గుర్తింపు కార్డులు అందజేయనున్నారు. దీనికోసం ప్రత్యేక శిబిరాలు సోమవారంనుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఇప్పటికే 35,500 మందికి గుర్తింపు కార్డులు అందజేయగా, ఆ కార్డుల్లో లోపాలు సరిచేయాలని వ్యాపారులు కార్పొరేషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యేక శిబిరాల్లో కార్డుల్లోని లోపాలు సరిచేసుకోవచ్చని, అందుకు సీనియర్ రెవెన్యూ అధికారిని సంప్రదించాలని వ్యాపారులకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) విజ్ఞప్తి చేసింది.

గర్భిణుల కోసం '102' వైద్యసేవలు

ఐసిఎఫ్, ఆగస్టు 18: స్థానిక డీఎంఎస్ ప్రాంగణంలో గర్భిణులకు 102 నెంబరుతో పనిచేసే వైద్య సేవా కేంద్రాన్ని ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం ప్రారంభించారు. ఈసేవా కేంద్రంలో 50మంది సలహాదారులు ఉంటారు. ఒక గర్భిణిని కనీసం ఐదు సార్లు సంప్రదించి వైద్య సలహాలు ఇస్తారు. దీని ద్వారా వారు మందులు సక్రమంగా తీసుకునే సదుపాయం కలుగుతోంది.ఈ పథకం 100 శాతం సఫలీకృతమవుతుందని అధికారులు తెలిపారు.

ఉన్నత విద్యాసంస్థల్లో క్రీడా పోటీలు

పెరంబూర్, ఆగస్టు 18: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అన్ని ఉన్నత విద్యాసంస్థల్లో క్రీడా పోటీలు నిర్వహించాలని యూజీసీ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు యూజీసీ కార్యదర్శి ఆర్.జోషి ఉన్నత విద్యాసంస్థలకు పంపిన ఉత్తర్వులో... ఈనెల 29 ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా ప్రకటించారన్నారు. ఈ నెల 26 నుంచి 31 వరకు ఏదో ఒకరోజు అథ్లెటిక్స్, అంతర్ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయాలని యూజీసీ తెలిపింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఆగస్టు 18: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అడయార్: 1వ అవెన్యూ, శాస్త్రి నగర్, ఎల్బీ రోడ్డు, పరమేశ్వరి నగర్, పద్మనాభ నగర్ 1,3 వీధులు

అరంబాక్కం: సోలయప్పన్ వీధి, యూనియన్ కార్బైట్ కాలని, పులిదివాక్కం మెయిన్ రోడ్డు, తంగవేలు వీధి, అన్నామలై వీధి, వేలాయుధం వీధి, ఎంపీ రాజగోపాల్ వీధి, భక్తసింగ్ వీధి, ఆర్ముగం వీధి, చెంగల్వరాయన్ వీధి

23న వరమూర్తీశ్వరాలయ కుంభాభిషేకం

పెరంబూర్, ఆగస్టు 18: తిరువళ్లూర్ జిల్లా కవరపేట సమీపం అరియతురై గ్రామంలో వెయ్యేళ్ల నాటి మరకతవల్లి సమేత వరమూర్తీశ్వర స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయ కుంభాభిషేకం ఈ నెల 23వ తేది జరుగనుంది. సోమవారం గణపతి, లక్ష్మీ, నవగ్రహ పూజలతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. అనంతరం యాగశాలలు ఏర్పాటు చేసి నాలుగు జాము పూజలు చేపట్టనున్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

16 కిలోల గంజాయి స్వాధీనం

పెరంబూర్, ఆగస్టు 18: స్థానిక పెరంబూర్ రైల్వేస్టేషన్‌లో చట్టవిరుద్ధంగా రైలులో తరలిస్తున్న 16 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాటా నగర్‌కు నుంచి ఎర్నాకుళం వెళ్లే ఎక్స్‌ప్రెస్ శనివారం అర్ధరాత్రి పెరంబూర్ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. రైలులో తనిఖీలు చేపట్టిన రైల్వే పోలీసులు, జనరల్ బోగీలో మూడు బ్యాగులను అనుమానించి వాటిని తనిఖీ చేసి 16 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకొని, గంజాయి తరలిస్తున్న వారి వివరాల కోసం విచారిస్తున్నారు.

27న బీఎడ్, ఎంఎడ్ పరీక్షలు

ప్యారీస్, ఆగస్టు 18: బీఎడ్, ఎంఎడ్ కోర్సుల పరీక్షలు ఈ నెల 27న ప్రారంభం కానున్నట్లు టీచర్ ఎడ్యుకేషనల్ యూనివర్సిటీ ప్రకటించింది. ఈ మేరకు తమిళనాడు టీచర్ ఎడ్యుకేషనల్ యూనివర్శిటీ ఎగ్జామ్ కంట్రోలర్ గణేశన్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... తమ వర్సిటీ పరిధిలో ఉన్న కళాశాలల్లో బీఎడ్, ఎంఎడ్ ప్రత్యేక విద్య ఫస్టియర్ పరీక్షలు 27న ప్రారంభమై సెప్టెంబరు 3వ తేది వరకు కొనసాగుతాయన్నారు. రెండవ సంవత్సర పరీక్షలు ఈ నెల 27తో ప్రారంభమై 31వ తేదీతో ముగుస్తాయని తెలిపారు.

జాలర్ల కుటుంబాలకు కనిమొళి పరామర్శ

ప్యారీస్, ఆగస్టు 18: శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసిన తూత్తుకుడి జాలర్ల కుటుంబాలను డీఎంకే ఎంపీ కనిమొళి పరామర్శించారు. తరువైకులం ప్రాంతం నుంచి గత నెల 21,23 తేదీల్లో సముద్రంలో చేపల వేటకు వెళ్లిన 22 మంది జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసి జైలుకు తరలించింది. ఈ క్రమంలో, శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్ల కుటుంబాలను పరామర్శించిన ఎంపీ కనిమొళి వారిని ఓదార్చి, జాలర్లను విడిపించేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

రాజేంద్ర చోళుడి మ్యూజియం

ఐసిఎఫ్, ఆగస్టు 18: అరియలూరు జిల్లా గంగైకొండచోళపురంలో రాజేంద్ర చోళుడి చరిత్ర తెలియజేసే మ్యూజియాన్ని రాష్ట్ర పురావస్తు, మ్యూజియం శాఖ ఏర్పాటుచేయనుంది. చోళులు కావేరి పూంపట్టణం, ఉరయూర్, పలయారై, తంజావూరు వంటి ప్రాంతాలను కేంద్రంగా పాలన సాగించారు. రాజరాజచోళుని అనంతరం ఆయన కుమారుడు రాజేంద్ర చోళన్ అధికారం చేపట్టారు. ఆయన వ్యవసాయ భూమి అయిన తంజావూరులో సైన్యాన్ని మోహరింపజేసేందుకు స్థలం లేకపోవడంతో అరియలూరు జిల్లా గంగైకొండచోళపురాన్ని రాజధానిగా చేసుకున్నారు. చోళగంగం పేరుతో ఆ ప్రాంతంలో చెరువు తవ్వించడంతో పాటు తంజావూరు బృహదీశ్వర ఆలయం మాదిరిగా శివాలయం నిర్మించారు. మాలిగైమేడు ప్రాంతంలో నిర్మించుకున్న అంతఃపురం నుంచి పాలన చేశారు. సముద్రయానం, నౌక నిర్మాణంలో సాంకేతికత, వాణిజ్యంలో రాణించారు. ఈయన పశ్చిమ, తూర్పు దేశాలతో వాణిజ్య లావాదేవీలు కలిగి ఉండేవారు. ఆయన అంతఃపురం ఉన్న ప్రాంతంలో రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పరిశోధనలు జరిగాయి. అందులో లభించిన ప్రాచీన వస్తువులు, ఇదివరకే రాజేంద్ర చోళుని పాలనకు సంబంధించి శిలాశాసనాలు, రాగి రేకులు వంటి వాటిని సేకరించి, ఆ చరిత్ర వివరించేలా అక్కడ మ్యూజియం ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. త్వరలో ఈ మ్యూజియాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని, రాజేంద్ర చోళుని జన్మదినమైన ఆదితిరువాదిరై రోజున ప్రతి ఏటా ప్రభుత్వ ఉత్సవాలు జరుగనున్నాయని పురావస్తు శాఖ అధికారులు తెలిపారు.

ఎరువుల కర్మాగారానికి మళ్లీ అనుమతి

ఐసిఎఫ్, ఆగస్టు 18: అమ్మోనియా లీకేజీ కారణంగా 8 నెలలు మూతపడిన ఎన్నూర్ ఎరువుల కర్మాగారం పాక్షికంగా పనిచేసేందుకు మళ్లీ అధికారులు అనుమతులిచ్చారు. ఎన్నూర్ పెద్దకుప్పం ప్రాంతంలో ప్రైవేటు ఎరువుల కర్మాగారం ఉంది. గత ఏడాది డిసెంబరులో ఈ కర్మాగారం నుంచి విడుదలైన అమ్మోనియం చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించడంతో అనేక మంది అస్వస్థతకు గురై చికిత్స పొందారు. దక్షిణ మండల గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వుల మేరకు అధికారులు ఈ కర్మాగారాన్ని మూసివేశారు. ఈ నేపథ్యంలో, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు ఈ కర్మాగారంలో అమ్మోనియ నిల్వలు ఉంచరాదని సూచిస్తూ పాక్షికంగా పనిచేసేందుకు మళ్లీ అనుమతులిచ్చింది.

తిరువళ్లూర్ వరకే అరక్కోణం రైళ్లు

ఐసిఎఫ్, ఆగస్టు 18: రైలు మార్గాల్లో మరమ్మతుల కారణంగా సెంట్రల్-అరక్కోణం మార్గంలో నడిచే 8 రైళ్లు తిరువళ్లూర్ వరకే నడువనున్నాయని చెన్నై రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. సెంట్రల్ నుంచి అరక్కోణానికి ఉదయం 9.10, 11 గంటల వెళ్లే రైళ్లు ఈ నెల 19,21 తేదీల్లో తిరువళ్లూర్ వరకు మాత్రమే నడువనున్నాయి. సెంట్రల్-తిరుత్తణి ఉదయం 10 గంటల రైలు కూడా అదే రోజుల్లో తిరువళ్లూర్ వరకు మాత్రమే నడుస్తుంది. అరక్కోణం-సెంట్రల్ ఉదయం 10.15, మధ్యాహ్నం 12 గంటల రైళ్లు ఈ నెల 19,21 తేదీల్లో తిరువళ్లూర్ నుంచి బయల్దేరనున్నాయి. అలాగే, తిరుత్తణి-సెంట్రల్ మధ్యాహ్నం 12.35 గంటల రైలు కూడా తిరువళ్లూర్ నుంచి బయల్దేరనుంది. వేలూరు కంటోన్మెంట్-అరక్కోణం ఉదయం 10 గంటల రైలు ఈ రెండు రోజుల్లో చిత్తేరి వరకు మాత్రమే నడువనుంది. సెంట్రల్-తిరుపతి ఉదయం 9.50 గంటల రైలు ఇదే రోజుల్లో తిరుత్తణి నుంచి బయల్దేరనుంది.

మహిళా సాధికారిక నిధిపై వదంతులు నమ్మొద్దు

పెరంబూర్, ఆగస్టు 18: రాష్ట్రప్రభుత్వం కలైంజర్ మహిళా సాధికారిక నిధి పథకంలో మహిళకు ప్రతినెలా రూ.1,000 ఇచ్చే పథకం అమలులో ఉంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి అర్హతను బట్టి లబ్ధిదారులను ఎంపిక చేస్తుండగా, అర్హత లేని దరఖాస్తులను అధికారులు నిరాకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, దరఖాస్తులు తిరస్కరణకు గురైన వారు, కొత్తగా ఈ పథకంలో చేరేందుకు దరఖాస్తులు సమర్పించవచ్చని కొద్దిరోజులుగా సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయి. వీటిని నమ్మిన మహిళలు దరఖాస్తు చేసేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు వస్తున్నారు. అలాంటి ప్రకటన తాము ఇవ్వలేదని చెబుతున్న జిల్లా అధికారులతో వారు వాగ్వివాదానికి దిగుతున్నారు. ఈ నేపథ్యంలో, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతా జీవన్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... మహిళా సాధికారిక పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు అని వస్తున్న వార్తలు ప్రజలు నమ్మరాదని, ప్రభుత్వం అలాంటి ప్రకటన చేయలేదని స్పష్టం చేశారు.

మద్యం మత్తులో పసిబిడ్డ హత్య.. వ్యక్తి అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 18: మద్యం మత్తులో రెండు నెలల కుమారుడిని హతమార్చిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుప్పూర్ జిల్లా పల్లడం పోస్టాఫీసు వీధికి చెందిన మణికంఠన్(45) ఓ ప్రైవేటు కంపెనీలో వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య సరోజిని, సూర్యదాస్ అనే రెండు నెలల కుమారుడున్నారు. కొద్దిరోజులక్రితం మణికంఠన్ తాగిన మత్తులో కుమారుడిపై దాడిచేసినట్లు సమాచారం. గాయాలతో ఉన్న కుమారుడిని తల్లి పల్లడం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్సలకు కోవై ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై పల్లడం పోలీసులు కేసు నమోదు చేసి మణికంఠన్‌ను అరెస్ట్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సూర్యదాస్ శనివారం మృతిచెందాడు. దీంతో మణికంఠన్‌పై నమోదుచేసిన దాడి కేసును హత్యా కేసుగా పోలీసులు మార్చి నమోదుచేశారు.

పెంపుడు కుక్క దాడిలో మహిళకు గాయాలు

పెరంబూర్, ఆగస్టు 18: కోయంబత్తూర్ గాంధీపురంలో, పెంపుడు శునకం దాడిలో మహిళ గాయపడిన వ్యవహారంలో, శునకం యజమానిపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఐజక్‌బాబు అనే వ్యక్తి తన పెంపుడు శునకంతో వాకింగ్‌కు వెళ్తున్న సమయంలో ఆ మార్గంలో వస్తున్న సింధు అనే మహిళను ఆ శునకం కరిచింది. దీంతో గాయపడిన మహిళను ఆసుపత్రికి తరలించిన పోలీసులు, శునకం యజమానిపై కేసు నమోదుచేశారు.

వినియోగంలో లేని విద్యుత్ కనెక్షన్లపై నిఘా


ఐసిఎఫ్, ఆగస్టు 18: ఉచితంగా పొంది వ్యవసాయానికి వినియోగించకుండా ఉన్న కనెక్షన్ల వివరాలతో పదిరోజుల్లోగా నివేదిక సమర్పించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందజేస్తోంది. దీని కోసం విద్యుత్ బోర్డు ఖర్చులను ప్రభుత్వం సబ్సిడీగా అందజేస్తోంది. ఈ ఉచిత విద్యుత్ వల్ల వ్యవసాయ శాఖకు ఏడాదికి రూ.7,280 కోట్లు ఖర్చవుతోంది. కొందరు వ్యవసాయ కనెక్షన్లు పొంది ఇతర ప్రయోజనాలకు వినియోగిస్తున్నట్లు ఫిర్యాదులందడంతో, అలాంటి కనెక్షన్లు గుర్తించి ఆ వివరాలు పది రోజుల్లో సమర్పించాలని అధికారులకు వ్యవసాయ శాఖ కార్యదర్శి అపూర్వ ఉత్తర్వులు జారీచేశారు.

పుళల్ కేంద్రంగా తాలూకా ఏర్పాటు చేయాలి

● ఎమ్మెల్యే సుదర్శనం

అడయార్, ఆగస్టు 18: స్థానిక మాధవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పుళల్, చోళవరం ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని కొత్తగా రెండు తాలూకాలను ఏర్పాటు చేయాలని సిట్టింగ్ ఎమ్మెల్యే సంతానం కోరారు. ఇదే విషయంపై ఆయన మాట్లాడుతూ, పుళల్ పంచాయతీ యూనియన్‌లో దాదాపు 39 మందికిపైగా గ్రామాలున్నాయి. ఈ గ్రామాలన్నింటికీ పొన్నేరి తాలూకా ఉందన్నారు. ఈ గ్రామాల ప్రజలు తమ పనుల కోసం పొన్నేరికి వెళ్ళి రావడం కష్టంగా ఉంది. అందువల్ల పొన్నేరి తాలూకా నుంచి పలు గ్రామాలను వేరుచేసి పొన్నేరి, చోళవరం కేంద్రాలుగా కొత్త తాలూకాలను ఏర్పాటు చేయాలని ఆయన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా తిరుమావళవన్ జన్మదిన వేడుకలు


కేక్ కటింగ్‌లో నేతలు, కార్యకర్తలు

వేలూరు, ఆగస్టు 18: స్థానిక కాట్పాడి వల్లిమలై బస్టాండ్ సమీపంలో డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ జన్మదిన వేడుకలు ఆ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రజలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అప్పు అలియాస్ వెంకటేశన్, జిల్లా కార్యదర్శి నిల చంద్రకుమార్, రాష్ట్ర ఆర్గనైజర్ ఫిలిప్, నగర సెక్రటరీ విజికుమార్, ఇళమ్ చిరుతైగల్ పాసర జిల్లా సెక్రటరీ రఘు, రాజ్‌కుమార్, ఆంథోని, శక్తివేలు, పాల్ స్వామి, స్టీఫెన్, సతీష్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పబ్‌లో డాన్స్ చేస్తూ విద్యార్థి మృతి

పెరంబూర్, ఆగస్టు 18: స్థానిక నుంగంబాక్కంలోని ఓ పబ్ డాన్స్ చేస్తున్న విద్యార్థి మృతిచెందాడు. నగరంలో హాస్టల్‌లో ఉంటూ ఎంబీఏ చదువుతున్న కారైక్కుడికి చెందిన మహమ్మద్ సుహైల్ శనివారం రాత్రి స్నేహితులతో కలసి నుంగంబాక్కంలోని ఓ పబ్‌కు వెళ్లాడు. అందరితో కలసి డాన్స్ చేస్తున్న సమయంలో హఠాత్తుగా అతను స్పృహతప్పి పడిపోయాడు. స్నేహితులు అతడిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.



తమిళ కళాకారులకు అవకాశాలివ్వాలి : నటి శ్రీనిహ

చిత్రజ్యోతి

తమిళ చిత్రపరిశ్రమలో ఎంతో మంది ప్రతిభ కలిగిన నటీనటులున్నారని, అలాంటి వారికి సినిమాల్లో అవకాశాలు రాకపోవడం ఎంతో బాధగా ఉందని యువ నటి శ్రీనిహ అన్నారు.'50-50' చిత్రంలో హీరోయిన్ చెల్లెలి పాత్ర ద్వారా తమిళవెండితెరకు పరిచయమైన శ్రీనిహ... 'ఆణ్ దేవతై', 'సైకో', హీరో సంతానం నటించి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న 'ఇంగే నాంగ దాన్ కింగు' వంటి చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషించింది. ప్రస్తుతం '8 తోట్టాగల్' ఫేం వెట్రి,సీనియర్ నటుడు సత్య రాజ్ ప్రధాన పాత్ర లో తెరకెక్కుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ జానర్ మూవీలో కీలక పాత్ర పోషిస్తున్నారు. హీరోయిన్‌గా నటించడానికి అన్ని రకాల అర్హతలున్నప్పటికీ ఆమెకు కేవలం చిన్నచిన్న పాత్రలే వస్తున్నాయి. ఇప్పటివరకు తన సినీ ప్రయాణంపై ఆమె స్పందిస్తూ, 'కంటెంట్ బాగుంటే ఎలాంటి పాత్ర అయినా పోషించేందుకు సిద్ధంగా ఉన్నాను. నృత్యశిక్షణ సమయంలో మోడలింగ్‌లో తొలిసారి అవకాశం రావడంతో అనేక వాణిజ్య ప్రకటనలో నటించాను. దర్శక ద్వయం జేడీ-జెర్రీలతో కలిసి పనిచేశాను. అలా సినిమాల్లో నటించే అవకాశం వరించింది. అయితే, ఒకే తరహా, గ్లామర్ ఎక్స్‌పోజింగ్ పాత్రలు వరుసగా వస్తుండటంతో వాటిని నిరాకరించాను. కథ డిమాండ్ చేస్తే గ్లామర్‌గా నటించడంలో తప్పులేదనీ, కేవలం సినిమా కోసం గ్లామర్‌గా నటించడం ఇష్టం లేదు.వైవిధ్యభరితమైన పాత్ర ల్లో నటించాలన్నది నా కోరిక. సంతానంతో కలిసి నటించడం మంచి అనుభవం.ఆయన నన్ను కోలీవుడ్ ప్రియాంక చోప్రాగా వర్ణించడం మరిచిపోలేని అనుభూతి. తమిళ చిత్రపరిశ్రమలో కేవలం హీరోయిన్ పాత్రలకు మాత్రమే కాకుండా, ఇతర పాత్రలకు కూడా తమిళ కళాకారులకు అవకాశాలివ్వాలి. విలన్‌తో సహా అన్ని రకాల పాత్రలు పోషించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆమె పేర్కొన్నారు.

'ఈగ' నుంచి తమిళులంతా ఆదరిస్తున్నారు

● నాని



'సూర్యాస్ సాటర్ డే' చిత్ర బృందం

చెన్నై వచ్చిన ప్రతిసారి తనపట్ల తమిళ ప్రజలు ప్రేమ, ఆదరాభిమానాలు చూపిస్తున్నారని, ముఖ్యంగా 'ఈగ సినిమా నుంచి తనను ఎంతగానో ఆదరిస్తున్నారని, అందుకు కృతజ్ఞత తెలుపుతున్నట్టు నేచురల్ స్టార్ నాని చెప్పారు. ఆయన హీరోగా నటించిన 'సూర్యాస్ సాటర్ డే'. డీవీవీ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నిర్మాత డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి సంయుక్తంగా నిర్మించారు. వివేక్ ఆత్రేయ దర్శకుడు. ఈ నెల 29వ తేదీ తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఆ సందర్భంగా చిత్ర బృందం నాని, ఎస్‌జే సూర్య, ప్రియాంక మోహన్, అభిరామి, అదితి బాలన్ శనివారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. హీరో నాని మాట్లాడుతూ, 'నగరానికి వచ్చిన ప్రతిసారి తమిళ ప్రజల ప్రేమను చూసి ఆశ్చర్యపోతున్నాను. తమిళ సినిమా నన్నెంతగానో ప్రభావితం చేసింది. కమల్ హాసన్, మణిరత్నం, శంకర్, భారతీరాజా సినిమాలు ఎక్కువగా చూసేవాడిని. 'ఈగ నుంచి ఆదరిస్తున్నారు. అందుకు కృతజ్ఞుడిని. 'సూర్యాస్ సాటర్ డే' ఇదొక స్పెషల్ మూవీ. సాధారణంగా నేటి జనరేషన్ యూత్‌కు ఒక యాక్షన్ ఎంటర్‌టైనర్ అంటే ప్రారంభం నుంచి ముగింపు వరకు ఉత్తేజంగా, ఉత్సాహంగా ఉండాలి. ఆ తరహాలోనే ఎన్నో సినిమాలు విడుదలయ్యాయి. తమిళ సినిమాల తరహాలో ఇది ఒక యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ. దర్శకుడు వివేక్.. అన్ని వర్గాల ప్రజల మనోభావాలను ప్రతిబింబించేలా రూపొందించారు. ఈ సినిమాలో ఎస్‌జే సూర్య అసలు హీరో (నవ్వుతూ). ఈ టైటిల్ ఆయనకు సరిగ్గా సరిపోతుంది. అందుకే నేను 'ఎస్‌జే సూర్య సాటర్ డే' అంటాను' అని పేర్కొన్నారు. ఆ తర్వాత అదితి బాలన్, అభిరామి, ప్రియాంక మోహన్, ఎస్‌జే సూర్య, దర్శకుడు వివేక్ ఆత్రేయ తదితరులు మాట్లాడారు.

డీ-ఏజింగ్‌పై విమర్శలు ఒక గుణపాఠం

● వెంకట్ ప్రభు



నిర్మాత అర్చన, వెంకట్ ప్రభు

తాను దర్శకత్వం వహిస్తున్న 'ది గోట్‌'లో చిత్ర కథానాయకుడు విజయ్‌ను డీ-ఏజింగ్‌లో చూపించడంపై వచ్చిన విమర్శలు తమకు ఒక గుణపాఠం వంటివని ఆ చిత్ర దర్శకుడు వెంకట్ ప్రభు అన్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రం 'ది గోట్ (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'. ఈ సినిమా ట్రైలర్ శనివారం రాత్రి నగరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వెంకట్ ప్రభు మీడియాతో మాట్లాడుతూ, 'ఈ సినిమాలో హీరో విజయ్‌ను డీ-ఏజింగ్‌లో చూపించాం. డీ-ఏజింగ్‌తో తీసిన 'స్పార్క్' పాటను ఇటీవల విడుదల చేయగా, విమర్శలు వచ్చాయి. దీంతో ఆడియన్స్ ఫీడ్‌బ్యాక్ తీసుకున్నాం. హీరో కూడా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆయన మంచి సలహా ఇచ్చారు. వాటిని దృష్టిలో ఉంచుకుని కొన్ని మార్పులు చేశాం. ట్రైలర్ చూసిన లుక్కే ఫైనల్ చేశాం. సినిమాలో కూడా దాన్నే చూపిస్తాం. మాకు ఇది గుణపాఠం వంటింది' అన్నారు. సినిమాలోని పాటలు బయట వినేందుకు మరోలా ఉన్నప్పటికీ తెరపై మాత్రం ప్రేక్షకులను ఆలరిస్తాయి. ఇది ఒక సైన్స్ ఫిక్షన్ యాక్షన్ మూవీ. ఈ సినిమా కోసం డీ-ఏజింగ్ టెక్నాలజీ ఉపయోగించాం. దానిసాయంతోనే విజయ్‌ను కుర్రాడిలా చూపించే ప్రయత్నం చేశాం. మరో గెటప్పులోనూ ఆయన సందడి చేయనున్నారు' అన్నారు. కాగా, ఈ సినిమాలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించారు. లైలా, స్నేహా, ప్రశాంత్, ప్రభుదేవా కీలక పాత్రలు పోషించారు. యువన్ శంకర్ రాజా సంగీతం సమకూర్చగా కల్పాతి అఘోరం, కల్పాతి ఎస్.గణేష్, కల్పాతి ఎస్.సురేష్, అర్చన కల్పాతి ఈ చిత్రాన్ని నిర్మించారు.



ఆడియో లాంచ్‌లో 'చెన్నై గ్యాంగ్‌స్టర్స్' చిత్ర బృందం

డబ్బు కోసం సినిమాలు తీయడం లేదు

● నిర్మాత బాబీ బాలచంద్రన్

డబ్బు సంపాదనే ధ్యేయంగా సినిమాలు తీయడం లేదని, రాష్ట్రంలో ఎంతోమంది ప్రతిభావంతులైన కళాకారులున్నారని అలాంటి వారిని గుర్తించి ఇండస్ట్రీ ద్వారా వెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్టు నిర్మాత బాబీ బాలచంద్రన్ అన్నారు. బీటీజీ యూనివర్సల్ పతాకంపై వైభవ్, అతుల్యారవి, ఆనంద్‌రాజ్, జాన్ విజయ్, రెడిన్ కింగ్‌స్లీ, సునీల్ రెడ్డి, మొట్టైరాజేంద్రన్, ఇళవరసు, లివింగ్‌స్టన్, మణికంఠన్ రాజేష్ తదితరులు నటించిన చిత్రం 'చెన్నై గ్యాంగ్‌స్టర్స్'. దర్శకత్వం విక్రమ్ రాజేశ్వర్, అరుణ్ కేశవ్. సంగీతం డి.ఇమ్మాన్. ఈ చిత్రం ట్రైలర్, ఆడియో ఆదివారం విడుదల చేశారు. నిర్మాత బాబీ బాలచంద్రన్ మాట్లాడుతూ, 'తమ బ్యానర్‌పై నిర్మించిన 'డిమాంటీ కాలనీ-2' ఈ నెల 15వ తేదీన విడుదల చేయగా ప్రేక్షకులు ఆదరించి తొలి సక్సెస్ అందించారు. ఇది రెండో చిత్రం. మూడో చిత్రాన్ని అరుణ్ విజయ్‌తో నిర్మిస్తున్నాం. అమెరికాలో వ్యాపారం చేసుకుంటున్న తాము తమిళ చిత్రపరిశ్రమలోకి రావడానికి ప్రధాన కారణం... సొంత రాష్ట్రంలో కొందరికైనా ఉపాధి కల్పించాలన్న భావన ఉంది. అందుకే సినిమా రంగాన్ని ఎంచుకున్నాం. ప్రతిభావంతులైన కళాకారులను గుర్తించి, తమ సంస్థ ద్వారా అవకాశాలు కల్పిస్తాం. హీరో వైభవ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా ఒక ఫన్ ప్యాక్ట్ మూవీ. అన్ని వర్గాల ప్రేక్షకులు చూసి ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుందన్నారు. దర్శకుడు విక్రమ్ రాజేశ్వర్ మాట్లాడుతూ, 'తొలిసారి దర్శకత్వం చేసే అవకాశం ఇచ్చిన నిర్మాతకు ధన్యవాదాలు. మీడియాతో ప్రేక్షకుల సపోర్టు కోరుతున్నాను' అని పేర్కొన్నారు. హీరోయిన్ అతుల్యా రవి మాట్లాడుతూ, 'వైభవ్ సరసన నటించడం సంతోషంగా ఉంది. నిర్మాత మరిన్ని సినిమాలు తీస్తూ మరింతమదికి అవకాశాలివ్వాలి' అని కోరారు. సంగీత దర్శకుడు ఇమ్మాన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా పాటలతో సంగీతం బాగా వచ్చింది. ఫన్ రైడ్ మూవీ. వైభవ్‌తో కలిసి మూడో చిత్రానికి పనిచేశాను. దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు' తెలిపారు.



కుట్రాలం జలపాతాల వద్ద స్నానం చేస్తున్న పర్యాటకులు

పర్యాటక ప్రాంతాలకు

పోటెత్తిన జనాలు



ఏర్కాడులో మినీ జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం తిరుచెందూరు, ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలైన కుట్రాలం, ఏర్కాడులో గత రెండు రోజులుగా పర్యాటకుల రద్దీ విపరీతంగా పెరిగింది. తమిళుల ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్య స్వామి కొలువైన ఆరుదివ్యక్షేత్రాల్లో ద్వితీయ క్షేత్రంగా భాసిల్లుతున్న తిరుచెందూరు సెందిల్ ఆండవర్ ఆలయానికి రోజూ వేలసంఖ్యలో వచ్చే భక్తులు స్వామివారిని దర్శిస్తుంటారు. ఆదివారం తమిళమాసమైన ఆవణి మొదటి ఆదివారం కావటంతో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు ఈ ప్రాంతానికి తరలివచ్చారు. సముద్రతీరంలో స్నానమాచరించిన తర్వాత స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆదివారం వేకువజాము నాలుగు గంటలకు ఆలయాన్ని తెరచి 4.30 గంటలకు విశ్వరూపదర్శనం, 6 గంటలకు ఉదయ మార్తాండ అభిషేకం, పూజలు నిర్వహించారు.

కుట్రాలంలో... : తెన్‌కాశి జిల్లా కుట్రాలం జలపాతాలు రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన పర్యాటకులతో కిటకిటలాడాయి. కుట్రాలంలోని ప్రధాన జలపాతం, ఐందరువి, పాత కుట్రాలం, పులి అరువి, సిట్రరువి జలపాతాల్లో నీటి ప్రవాహంలో మూలికా వాసన అధికంగా ఉండడంతో స్నానం చేయడానికి పర్యాటకులు బారులు తీరారు. ఈ నెల 'సారల్ ఉత్సవాలు' కూడా ప్రారంభం కావటంతో ఆదివారం ఉదయం మహిళల కోసం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఇదే విధంగా పురుషులకు దేహదారుఢ్య పోటీలు జరిపారు.

ఏర్కాడులో... : సేలం జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం 'పేదల ఊటీ'గా పేరుగాంచిన ఏర్కాడులో గత రెండు రోజులుగా పర్యాటకుల సందడి అధికమైంది. ఏర్కాడు అంతటా ప్రస్తుతం చల్లటి వాతావరణం ఉంది. అప్పుడప్పుడూ తేలికపాటి వాన జల్లులు కూడా పడుతున్నాయి. దీంతో అన్నా పార్కు, ట్యాంక్ పార్క్, రోస్ గార్డెన్, లేడీస్ సీట్, పకోడా పాయింట్, సేర్వరాయన్ గుహాలయం, ఐందినై పార్కు, తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచే వేల సంఖ్యలో పర్యాటకులు గుమికూడారు. బోట్ హౌస్ ప్రాంతం వద్ద పర్యాటకులు క్యూలైన్లలో నిలచి పడవ ప్రయాణం సాగించారు.



తిరుచెందూరు ఆలయం వద్ద గుమికూడిన భక్తులు

పట్టభద్రులు అన్ని రంగాల్లో రాణించాలి

● అమెరికా మొటరాక్ సీటీఓ అశ్విన్‌రాజా
● ఘనంగా సత్యభామ వర్శిటీ స్నాతకోత్సవం



విద్యార్థులకు పట్టా ప్రదానం చేస్తున్న అశ్విన్ రాజా, మారీ జాన్సన్, మరియజీనా జాన్సన్

ప్యారీస్, ఆగస్టు 18: పట్టభద్రులు అన్ని రంగాల్లో సాధించి నూతన ప్రయోగాలకు శ్రీకారం చుట్టాలని అమెరికాకు చెందిన మొటరాక్ సంస్థ కో-ఫౌండర్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అశ్విన్ రాజా పేర్కొన్నారు. స్థానిక సెమ్మంజేరిలోని సత్యభామ డీమ్డ్ వర్సిటీ నిర్వహిస్తున్న సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ 33వ స్నాతకోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. సంస్థ ప్రెసిడెంట్ డా.మారీ జాన్సన్, ఛాన్సలర్ మరియజీనా జాన్సన్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అశ్విన్ రాజా, 3,508 యూజీ, 644 పీజీ, 122 పీహెచ్‌డీ మొత్తం 4,152 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. వీరిలో 45 మంది ర్యాంకర్లకు సంస్థ తరఫున బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. నేడు ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతూ అంతర్జాతీయ విద్యాసంస్థగా సత్యభామ డీమ్డ్ వర్శిటీ గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి క్యాంపస్ ఇంటర్వ్యూలో కన్నన్, నన్నన్ అనే విద్యార్థులను సంవత్సరానికి రూ.50 లక్షల వేతనంతో తమ సంస్థ తరఫున ఎంపిక చేసినట్లు తెలిపారు. ఛాన్సలర్ మరియ జీనా జాన్సన్ మాట్లాడుతూ... 2023-24వ విద్యా సంవత్సరంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 417 ప్రముఖ సంస్థలు పాల్గొని 92.72 శాతం ఉద్యోగాలకు తమ వర్సిటీ విద్యార్థులను ఎంపిక చేసుకోవడం రికార్డుగా భావిస్తున్నట్లు తెలిపారు. డా.మారీ జాన్సన్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐఆర్ఎఫ్ ఇటీవల దేశంలో ర్యాంకులు సాధించిన వర్సిటీల వివరాలు విడుదల చేసినందని, ఇందులో తమ వర్సిటీ 51వ ర్యాంకు సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా.ఎస్ఎస్ రావు, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా.బి.షీలారాణి, ఉపాధ్యక్షులు మరియ క్యాథరిన్ జయప్రియ, బెర్నాడిట్ తమిళరసి, జె.అరుళ్‌సెల్వన్, ప్రొ వైస్ ఛాన్సలర్ డా.ఇ.లోకషణ్ముగం, డా.ఎస్.ప్రభు, డా.జి.సుందరి సహా విద్యార్థులు, ప్రొఫెసర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హొగెనేకల్‌లో దోనెల సవారీకి అనుమతి



పెరంబూర్, ఆగస్టు 18: హొగెనేకల్ కావేరి నదిలో దోనెల సవారీ ఆదివారం ప్రారంభమైంది. హొగెనేకల్ కావేరి నదిలో శనివారం హఠాత్తుగా నీటి రాక 28,000 ఘనపుటడుగులకు పెరగడంతో, దోనెల సవారీకి జిల్లా యంత్రాంగం నిషేధం విధించింది. ఈ క్రమంలో, ఆదివారం కావేరి నదిలో నీటి రాక 17,000 ఘనపుడుగులుకు తగ్గడంతో దోనెల సవారీకి అనుమతించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో హొగెనేకల్‌కు పెద్దసంఖ్యలో వచ్చిన పర్యాటకులు, దోనె సవారీ అనుమతించడంతో హర్షం వ్యక్తం చేశారు.

భవానీ అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి



ప్రత్యేక పూజల్లో కేంద్ర మంత్రి మురుగన్, కుటుంబ సభ్యులు

పెరంబూర్, ఆగస్టు 18: తిరువళ్లూర్ జిల్లా పెరియపాళయంలో భవాని అమ్మవారి ఆలయాన్ని కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ కుటుంబ సమేతంగా సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలుచేశారు. కేంద్ర మంత్రికి అర్చకులు ప్రసాదాలు అందజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం భక్తులకు కేంద్ర మంత్రి అన్నదానం చేశారు.

'వయనాడ్' కోసం మార్టిన్ గ్రూపు రూ.2 కోట్ల విరాళం



కేరళ సీఎం విజయన్‌కు చెక్కు అందజేస్తున్న దృశ్యం

అడయార్, ఆగస్టు 18: ప్రకృతి విలయంలో చిక్కుకున్న వయనాడ్‌లో బాధితులను ఆదుకునేందుకు కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి మార్టిన్ గ్రూపు రూ.2 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. ఈ చెక్కును ఆ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ చార్లెస్ మార్టిన్ కేరళ సీఎంను కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రూపు డైరెక్టర్లు డాక్టర్ లీమా రోజ్ మార్టిన్, సింధుశ్రీ చార్లెస్, రోటరీ ఇంటర్నేషనల్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఏకే కురియచన్, కైరాలి టీవీ సీనియర్ మేనేజర్ జిగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి ఇంట్లో శుభకార్యం సింగపూర్ నుంచి వచ్చిన పారిశ్రామికవేత్త



పిల్లలతో సింగపూర్ పారిశ్రామికవేత్త

పెరంబూర్, ఆగస్టు 18: శివగంగ జిల్లా వలయంపట్టికి చెందిన ఓ సంస్థ ఉద్యోగి ఇంటి శుభ కార్యక్రమానికి సింగపూర్ నుంచి వచ్చిన పారిశ్రామికవేత్తను ఊరేగిస్తూ ఘనస్వాగతం పలికారు. సింగపూర్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో ఆనంద్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన తన ఇద్దరు కుమారులు బాప్టిజం తీసుకొనే వేడుకలకు తాను పనిచేస్తున్న సంస్థ యజమాని కొన్‌జోంగ్‌ను ఆహ్వానించారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి సింగపూర్ నుండి వచ్చిన యజమానిని సార్ట్ బండిలో ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ పారిశ్రామికవేత్త తమిళ సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొనడం విశేషం.

ప్రపంచ రికార్డును నెలకొల్పిన గ్లెనెగల్స్ హాస్పిటల్ నర్సులు



నర్సులు రూపొందించిన 'అవర్ నర్సెస్ - అవర్ ఫ్యూచర్'

అడయార్, ఆగస్టు 18: నగరంలోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఒకటైన గ్లెనెగల్స్ హాస్పిటల్ చెన్నై అండ్ అసోసియేషన్ ఆఫ్ నర్స్ ఎగ్జిక్యూటివ్ (ఇండియా) తమిళనాడు చాప్టర్ తరఫున 2500 మందికిపైగా నర్సులు ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఈ రికార్డును ఐన్‌స్టీన్ వరల్డ్ రికార్డు ఇన్‌స్టిట్యూట్ గుర్తించింది. ఈ సందర్భంగా వారంతా 'అవర్ నర్సెస్ - అవర్ ఫ్యూచర్ : ది ఎకనామిక్ పవర్ ఆఫ్ కేర్' పేరుతో ఆదివారం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా గ్లెనెగల్స్ హెల్త్‌కేర్ ఇండియా నర్సింగ్ డైరెక్టర్ డాక్టర్ జోతి క్లారా మైకేల్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలకు వెన్నెముకగా ఉండే నర్సుల అచంచలమైన నిబద్ధత, సంరక్షణ, సేవకు నివాళి వంటిదని ఆమె కొనియాడారు.

ఘనంగా 'ఉనా విల్లా' ప్రారంభం



'ఉనా విల్లా' ప్రారంభోత్సవ దృశ్యం

అడయార్, ఆగస్టు 18: నగర నడిబొడ్డున కొఠారి ఇండస్ట్రియల్ కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐసీఎల్) సమకాలీన వంటలను పరిచయం చేస్తూ గత కాలపు శోభను గుర్తుకు తెచ్చేలా 'ఉనా విల్లా' నెలకొల్పింది. దీనిని తాజాగా ప్రారంభించారు. ఈ ప్రారంభం ఆహార, ఆతిథ్య రంగంలో గణనీయమైన విస్తరణకు నాందిగా ఫైన్ డైనింగ్ రంగంలోకి కేఐసీఎల్ ప్రవేశించింది. నుంగంబాక్కంలో ఈ ఉనా విల్లా ప్రారంభించింది. ఇక్కడకు వచ్చే ప్రతి ఒక్కరికీ గొప్ప సంస్కృతితో పాటు మంచి ఆహ్లాదరకమైన వాతావరణాన్ని అందించేలా సకల సౌకర్యాలను కల్పించింది. ఇందులో సెలెబ్రేట్ ఎవ్రీడే మూవ్‌మెంట్ పేరుతో రుచికరమైన వంటకాలను అందుబాటులో ఉంచుతారు. 'ఉనా విల్లా'ను కేఐసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ రఫీక్ అహ్మద్, ఇతర నిర్వాహకులు కలిసి ప్రారంభించారు.

'రేలా' ఆధ్వర్యంలో మహిళల భద్రతపై సైక్లథాన్



సైక్లథాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న రేలా హాస్పిటల్ సీఈఓ డాక్టర్ ఇలన్‌కుమరన్ కలియమూర్తి తదితరులు

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళల భద్రతపై అవగాహన కల్పించేలా క్రోంపేటలోని రేలా హాస్పిటల్ నిర్వాహకులు చెన్నై సైక్లిస్ట్స్ సహకారంతో ఆదివారం సైక్లథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేలా హాస్పిటల్ సీఈఓ డాక్టర్ ఇలన్‌కుమరన్ కలియమూర్తి, అంతర్జాతీయ సైక్లిస్ట్ డాక్టర్ ఎం.సౌందరరాజన్, 'మైండ్ అండ్ మామ్' సీఈఓ పద్మినీ జానకి రేలా హాస్పిటల్ ఇంట్రావెన్షనల్ రేడియాలజీ హెచ్ఓడీ డాక్టర్ దీపాశ్రీ, చెన్నై సైక్లిస్ట్స్ కోర్ మెంబర్ అనిల్ జైన్ తదితరులు పాల్గొన్నారు. 16 నుంచి 70 యేళ్లలోపున్న సుమారు 500 మంది ఈ సైక్లథాన్‌లో పాల్గొన్నారు. ఈ సైకిల్ ర్యాలీ జీఎస్టీ రోడ్డు, తిరుపోరూరు, చెంగల్పట్టు, పాలూరు, ఒరగడం, పడప్పై, ముడిచ్చూరు వరకు కొనసాగింది. సైక్లథాన్‌లో విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

కమలా దేవి గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు ప్రారంభం



ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో విద్యార్థినులు, నిర్వాహకులు

అడయార్, ఆగస్టు 18: స్థానిక టి.నగర్‌లోని గుంటూరు సుబ్బయ్య పిళ్ళై బాలిక హైయ్యర్ సెకండరీ స్కూల్‌లో టి.నగర్ రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఆధ్వర్యంలో కమలా దేవి శ్రీశ్రీమాల్ గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు తాజాగా ప్రారంభించారు. విద్య అనేది ప్రాథమిక హక్కుగా పరిగణించిన రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్... దాన్ని ప్రతి ఒక్కరికీ అందించేందుకు కృషి చేస్తుంది. ముఖ్యంగా బాలికలకు ఈ విద్య అందించడం ద్వారా స్వాతంత్ర్యం, స్వావలంబన పెంపొందిస్తుందని, వారి కలలు, ఆకాంక్షలను నెరవేర్చుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందని రోటరీ క్లబ్ భావిస్తుంది. అందుకే ఈ గర్ల్ చైల్డ్ ప్రాజెక్టును చేపట్టింది. తాజాగా జరిగిన ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు విపిన్ అగర్వాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.15 లక్షలు కాగా, 414 మంది బాలికలు, ఐదుగురు మహిళా ఉపాధ్యాయులు లబ్ధి పొందనున్నారు.